క్లుప్తంగా

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



పాన్‌గల్: బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణ, మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలల హక్కులు, రక్షణ చట్టాలు, బాలల సంక్షేమ సమితి ద్వారా అందిస్తున్న సర్వీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, 100 అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, బాలల సంక్షేమ సమితి సభ్యులు విష్ణు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు



చిన్నంబావి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు అరుణ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. మంత్రి స్వగ్రామం అయిన పెద్దదగడలో మాజీ ఎంపీటీసీ పుష్పావతి ఆధ్వర్యంలో జూపల్లి అరుణ్ జన్మదినం సందర్భంగా మండల వ్యాప్తంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్‌యాదవ్, బీచుపల్లి యాదవ్, ఈదన్నయాదవ్, రంజిత కుమార్, తేజారెడ్డి, వడ్డెమాన్ బిచ్చన్న, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల ఊరేగింపు



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో శనివారం నుంచి నిర్వహించనున్న కాళికాదేవి పండుగ సందర్భంగా అమ్మవారి ఆభరణాలను శుక్రవారం ఊరేగించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజనలు, డప్పు వాయిద్యాలతో మధ్య గ్రామస్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు చేస్తూ ఆలయం వద్దకు తీసుకెళ్లి అమ్మవారికి అలంకరించారు. గ్రామంలో కాళికాదేవి బోనాల పండుగతో పాటు జాతర జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీపిల్లలకు గాయాలు

వనపర్తి రూరల్: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి సమీపంలో గల ఎన్‌హెచ్44 రోడ్డుపై శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ మండలంలోని రేచింతల గ్రామానికి చెందిన మేకల గొల్ల కురుమన్న చిన్న కుమార్తె మహేశ్వరిని వీపనగండ్ల మండలంలోని పుల్గరచెర్ల గ్రామానికి చెందిన కురుమూర్తితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించారు. మహేశ్వరి గురువారం తండ్రిని చూడడానికి రేచింతల గ్రామానికి వచ్చింది. ఆమె తిరిగి అత్తగారి ఇంటికి తన ఇద్దరి పిల్లతో కలిసి శుక్రవారం ఉదయం తండ్రి బైక్‌పై బయలుదేరింది. వారు తోమాలపల్లి సమీపంలోకి రాగానే బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తండ్రి, కుమార్తె, ఇద్దరు చిన్నారులకు రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులను వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు కురుమూర్తి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వరదతో 50 ఎకరాల పంట నష్టం



అమరచింత: పట్టణంలోని పెద్దచెరువు అలుగు పారుతుండటంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అలుగు నీరు చేరడంతో వంపు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో సమీపంలోని వరి పొలాలు నీట మునిగాయి. సుమారు 50 ఎకరాల మేరకు వరి పంట నీట మునిగిందని రైతులు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం



వీపనగండ్లలో వీధులను శుభ్రపరుస్తున్న పంచాయతీ సిబ్బంది, వైద్యాధికారులు

ఆత్మకూర్: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని 10వ వార్డులో కౌన్సిలర్ తబస్సుంమోసీన్ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

వనపర్తిటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఆదివారం ఒక అరగంట కేటాయించి, ఆరోగ్యంగా ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ ఏ, బీ బాలుర వసతి గృహాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ప్రార్థన చేయించి స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్ ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల, కల్వరాలలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలతో కలిసి పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోని వీధులన్నింటిని పరిశీలించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తీక్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, మహేశ్వరి, కమల, సువర్ణ, ఏఎన్‌ఎం రామచంద్రమ్మ, ఆశాకార్యకర్తలు రాధ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాల పరిశుభ్రత కోసం మున్సిపాలిటీకి ప్రజలు సహకరించాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆయా వార్డుల్లోని కాలనీల్లో పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలు తొలగించడం, రహదారిపై నిలిచిన వర్షపు నీటిని మళ్లించడం వంటి పనులను మున్సిపల్ కార్మికులతో చేయించారు. రహదారిపై ఉన్న గుంతలను మొరం మట్టితో కప్పి ఉంచారు. ఈమేరకు ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ మురుగుకాల్వలలో దోమలు నివారణ మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఆరోగ్య శాఖ సిబ్బంది, మోప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అపరిశుభ్రతతోనే రోగాలు

పాన్‌గల్: గ్రామాల్లో అపరిశుభ్రత, నిల్వ నీటితోనే రోగాలు సంభవిస్తున్నాయని, వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ గ్రామస్తులకు సూచించారు.మండల కేంద్రంలోని పలు కాలనీలల్లో పర్యటించి పారిశుద్ధ్య నివారణ పనులు పరిశీలించారు.

చిన్నంబావి: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉమ్మడి మండల ఎంపీడీఓ రమణరావు అన్నారు. ఆయన కొప్పునూరులో పర్యటించి, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

మదనాపురం: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్యపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రసన్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని ఎంపీఓ రాఘవ అన్నారు. వనపర్తి మండలంలోని నాచహళ్లిలో ఆయన పర్యటించి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నూతన్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది



ఆరేపల్లిలో..

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి

అమరచింత: శిశుమందిరాలు దేశ చరిత్రతో పాటు సంస్కృతి, సాహిత్యాలను విద్యార్థులకు అందిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిరంలో శుక్రవారం నిర్వహించిన గణిత జ్ఞాన విజ్ఞాన మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా గద్వాల, నారాయణపేట జిల్లాల నుంచి ప్రదర్శనతో వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచే చదువుతో పాటు సంస్కారం నేర్పించే ఏకైక పాఠశాలలు శిశుమందిరాలే అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శిశుమందిరాలలో ఆంగ్ల విద్య విధానం ప్రవేశ పెట్టారన్నారు. అనంతరం వివిధ ప్రదర్శనలతో ఆకట్టుకున్న పాఠశాలల విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, అమరచింత ఎత్తిపోథల కమిటీ అధ్యక్షురాలు సౌజన్యరెడ్డి, ప్రధాన చారి లక్ష్మీమాతాజీ, జిల్లా విభాగ్ సూర్యనారాయణ, తాటికొండ విజయ్, ఊషన్న, మేర్వరాజు, సత్యనారాయణ, బాలస్వామి, రాములు, నారాల నారాయణ, న్యూమరాలజిస్ట్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొర్లకుంటలో వైద్యుల పర్యటన

సాక్షి ఎఫెక్ట్..

వీపనగండ్ల: మండలంలోని కొర్లకుంటలో పలువురు ప్రజలు విషజ్వరాల బారిన పడిన విషయాన్ని శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురించగా.. అందుకు స్పందించిన పంచాయతీరాజ్, వైద్యాధికారులు శుక్రవారం గ్రామాన్ని సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలో కొందరికి విషజ్వరాలు ఉన్న మాట వాస్తవమేనని, వారికి తక్షణం వైద్య వసతులు అందించడంతో పాటు అవసరమైతే గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు.



సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. దోమలు వృద్ధి చెందకుండా పాటించాల్సిన నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు పరిసరాలల్లో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తారాశశాంక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, కస్తూర్బా ఎస్‌ఓ హేమాలత, హస్టల్ వార్డెన్ ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రానికి చెందిన తప్పెట కోటయ్య (55) గురువారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శుక్రవారం రేవల్లి మండల కేంద్రంలోని మృతుడి ఇంటి వద్దకు చేరుకుని కోటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భీమయ్య, మాజీ వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వీపనగండ్ల: ప్రభుత్వ నిబంధనల మేరకు కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. వర్షాల వల్ల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌ఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి మాకు ఇప్పించండి'

ఆత్మకూర్: పట్టణ శివారులోని సర్వే నంబర్ 221లోని ఆరు ఎకరాల వ్యవసాయ భూమి కబ్జాకు గురైందని, మాభూమి మాకిప్పించండి అంటూ బాధితులు శుక్రవారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ భూమిని ఇతరులు కబ్జా చేశారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి 11 మంది రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లానాయకుడు శ్రీహరి, రైతులు చెట్ల శ్రీను, దండుశ్రీను, రామకృష్ణ, చంద్రమ్మ, జమ్ములు, రవి, కుమార్, భగవంతు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులే భావిభారత నిర్మాతలు



అమరచింతలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలాంపాషా

వనపర్తి టౌన్:రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పలుస శంకర్‌గౌడ్‌ను వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బి. శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు ఈశ్వర్, సురేష్, అమరేందర్‌గౌడ్, కౌన్సిలర్ బ్రహ్మం, రామిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన యాపర్ల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్‌ను శుక్రవారం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్‌తో పాటు పలువురు పూలమాలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, తిరుపతయ్య గౌడ్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు మోహన్‌గౌడ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం శివకుమార్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు శివకుమార్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, దామోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: పొలికెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ బోధిస్తున్న ఈశ్వరాచారి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో ఆయనను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డెరాములు, గుంత అశోక్‌కుమార్‌రెడ్డి, శివ, మునీంద్ర పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాషా, రిటైర్డ్ టీచర్ షేక్‌అహ్మద్, ఉపాధ్యాయులు ఆనందలక్ష్మి, హరిత, జ్యోతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాములు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో శుక్రవారం పాఠశాల జీహెచ్‌ఎం సెక్యానాయక్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, కుర్మయ్య, అరుణ, మంజులత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రిపై అసభ్యకర పోస్టులు సరికాదు'



పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై అసభ్యకరమైన, కించపరుస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులను పెట్టిన అంబటి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిరంజన్‌రెడ్డి మంత్రిగా ఉన్న కాలంలో పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందుకే ప్రజలు ఓడించారని, లా చదివిన ఆయన కేవలం లాభాపేక్షతోనే రాజకీయాలు చేశారని పోస్టులు పెట్టడం సరికాదన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో నిరంజన్‌రెడ్డి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. పోలీసులకు వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, నాగేంద్రంయాదవ్, పురుషోత్తంరెడ్డి, సేనాపతిచారి, గట్టు, సతీష్, శివారెడ్డి, సురేష్, జంగం రమేష్, ఆంజనేయులు, రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

మంత్రి ఆదేశించినా.. స్పందించని అధికారులు



వరద నీటిలోనే యూరియా బస్తాలు మోసుకెళ్తున్న రైతు

పాన్‌గల్: భారీ వర్షాలతో కోతకు గురైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టి గ్రామస్తులు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పీఆర్ అధికారులను ఆదేశించినా అధికారులు స్పందించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొత్తపేట గ్రామస్తులు, రైతులు వాపోతున్నారు. మండలంలో భారీ వర్షాలకు కోతకు గురైన సాగునీటి కాల్వలు, రోడ్లను మంత్రి జూపల్లి ఈనెల 3వ తేదీన పరిశీలించారు. కొత్తపేట సమీపంలోని పీఆర్ రోడ్డుపై అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణంతో వరద, చెరువు అలుగు నీరు సక్రమంగా ప్రవహించక రోడ్డు కోతకు గురైంది. శుక్రవారం పలువురు రైతులు తమ పంట పొలాలకు యూరియా బస్తాలు తీసుకవెళ్లడానికి వీలు లేక ఇబ్బందులు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో మోసుకుంటూనే పొలాలకు తీసుకెళ్లామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తాత్కాలిక మరమ్మతు చేపట్టి గ్రామానికి, పంట పొలాలకు వెళ్లేందుకు వీలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఈఈ మల్లయ్యను వివరణ కోరగా.. డీఈ, ఏఈలతో మాట్లాడి వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి గ్రామస్తులు, రైతుల ఇబ్బందులను తొలగిస్తామన్నారు.

వాటర్ ట్యాంక్‌కు మరమ్మతు చేయాలి



ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని 10వ వార్డులోని వాటర్ ట్యాంక్ నీటి లీకేజీతో పాటు రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చాయని, ప్రమాదం జరగక ముందే మరమ్మతు చేయాలని వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్‌లోని పబ్లిక్ హెల్త్ ఈఈ విజయకుమార్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.50 లక్షల లీటర్ల సామర్థం గల వాటర్ ట్యాంక్ 1997లో నిర్మించారన్నారు. అప్పట్లో పట్టణంలోని అయిదు వార్డులకు నీటి సరఫరా అయ్యేదన్నారు. కార్యక్రమంలో రాములుయాదవ్ పాల్గొన్నారు.

పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు..



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

వనపర్తిటౌన్: విద్యార్థులు స్వయం కృషి, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని స్కాలర్స్ జూనియర్ కళాశాల యాజమాన్య సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ జి.వరప్రసాద్, బి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎల్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్కాలర్స్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రమశిక్షణ లేకపోతే జీవితంలో ఉన్నతంగా రాణించలేరని, పట్టుదల, కృషి ఎదగడానికి ఎంత అవసరమో క్రమశిక్షణ సైతం అంతే అవసరమన్నారు. 33 ఏళ్లుగా స్కాలర్స్ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిందని, నేడు వారు ఉన్నత హోదాలో సమాజ సేవ చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. వనపర్తిని విద్యాపర్తిగా మార్చేందుకు స్కాలర్స్ ఎంతగానో కృషి చేసిందని వెల్లడించారు. విద్యార్థుల పాటలు, నృత్య ప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, విజయ్‌కుమార్, కిష్టారెడ్డి, రవి కుమార్, మల్లారెడ్డి, అనిల్ కుమార్, కిషోర్, తిరుపతయ్య, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వర్షపాతం



అలుగు పారుతున్న పొలికెపాడు మొగుళ్ల చెరువు

గోపాల్‌పేట: ఉమ్మడి మండలంలో గురువారం రాత్రి రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. గోపాల్‌పేట మండలంలో గురువారం రాత్రి 70.8 ఎంఎం, రేవల్లి మండలంలో 73.6 ఎంఎం వర్షపాతం నమోదు అయిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో పొలికెపాడు మొగుళ్ల చెరువు నిండి అలుగు పారడంతో కిందనున్న వరి పంటలు నీటి మునిగాయి. అధికారులు వెంటనే క్షేత్ర పరిశీలన చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

రక్తనమూనాల సేకరణ

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, లేకుంటే విషజ్వారలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు డాక్టర్ శ్వేత, కేశవులు, హెచ్‌ఈ జహంగీర్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, పలువురు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆత్మకూర్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ముగ్గురికి జైలు శిక్ష

ఆత్మకూర్: దాయాదుల కుటుంబ కలహాల్లో దాడి ఘటనలో ముగ్గురికి నాలుగు నెలల పాటు జైలు శిక్ష పడిందని ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు. శుక్రవారం ఆత్మకూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శిరీష వెలువరించిన శిక్ష వివరాలు ఈవిధంగా ఉన్నాయి. మండలంలోని మూలమళ్లలో నివాసముంటున్న కృష్ణయ్య, ఆశన్న కుటుంబాలు ఎదురెదురుగా ఉంటారు. 2018 సెప్టెంబర్ 11న ఇరు కుటుంబాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈదాడిలో కృష్ణయ్య కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడి పోలీసులను ఆశ్రయించారు. దాడికి పాల్పడ్డ వల్లూరి ఆశన్న, శ్రీను, మహేందర్‌కు న్యాయమూర్తి నాలుగు నెలలపాటు జైలుశిక్ష విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.